క్లుప్తంగా

మొక్కల పంపిణీ



మొక్కలు అందజేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక పట్టణంలోని పలు కాలనీల్లో పర్యావరణ పరిరక్షణ సమితి రాజాం శాఖ ప్రతినిధులు మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, వెయ్యి మొక్కలు నాటి, వెయ్యి వృక్షాలు చేద్దాం అనే నినాదంతో మొక్కలు పంచిపెడుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్కను నాటి, సంరక్షించాలని సమితి కన్వీనర్ నాయుడు కోరారు.

144 సెక్షన్ అమలుతో నిర్మానుష్యం



నిర్మానుష్యంగా మారిన గజపతినగరంలోని ఓ రోడ్డు

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గజపతినగరంతో పాటు అన్ని గ్రామాల్లో మంగళవారం 144 సెక్షన్‌ను పోలీస్‌లు అమలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో ,గ్రామాల్లోని రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం ఆన్‌లైన్ చేసుకోండి

బొండపల్లి: పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్బీకే)వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.జీలుగ, కట్టె జనుము, పిల్లిపెసర విత్తనాలు ఆర్బీకేలో సిద్ధంగా ఉన్నాయని, 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తామని, కావాల్సిన రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

6న శనీశ్వర జయంతి

బొండపల్లి: ఈనెల 6వ తేదీన శనీశ్వరుడి జయంతి సందర్భంగా మండలంలోని దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ మంగళవారం తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోనే ఉన్న శనీశ్వరుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఊరేగింపులు నిర్వహించరాదు: ఎస్సై



సింగిడి కూడలిలో పర్యటిస్తున్న ఎస్సై ప్రసాద్, సిబ్బంది

భామిని: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని బత్తిలి ఎస్సై చేకూరి ప్రసాద్ అన్నారు. మండలంలోని బత్తిలి, గురండి, సింగిడి, భామిని గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద మంగళవారం పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, పోస్టులు చేయవద్దని ప్రజలకు సూచించారు. గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలన్నారు. అనవసర వివాదాలకు తావివ్వొద్దని కోరారు.

విజయోత్సాహం



భామినిలో టీడీపీ, జనసేన నాయకుల విజయోత్సవాలు

భామిని: పాలకొండ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ విజయం సాధించడంతో టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. మంగళవారం ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయోత్సాహంతో నినాదాలు చేశారు. నేరడి-బిలో మందుగుండు కాల్చుతూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురండిలో వీధుల్లోకి కార్యకర్తలు వచ్చి నృత్యాలు చేస్తూ నినాదాలు చేశారు. దిమ్మిడిజోలకు చెందిన జనసేన నాయకులు ఎమ్మెల్యేగా గెలుపొందిన నిమ్మక జయకృష్ణను దుశ్శాలువతో సత్కరించారు.

చెరకు సాగుపై రైతుల దృష్టి

- 5 వేల ఎకరాల్లో సాగు



వెంకటాపురంలో బోదెలపై చెరకు విత్తనం



పెదంకలాంలో మొక్క చెరకుతోట

సీతానగరం: మండలంలోని రైతులు వాణిజ్యపంటగా ఎంపిక చేసుకున్న చెరకుసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పాయాయిట్ పంట, జొన్నగింజల ధర హెచ్చుతగ్గులు, కూలీల బెడద వల్ల నీటి ఎద్దడి తట్టుకునే చెరకు పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బూర్జ, వెంకటాపురం, లక్ష్మీపురం, ఏగోటివలస, చినభోగిలి, కాశీపేట, పణుకుపేట, పెదభోగిలి, కృష్ణారాయపురం, చెల్లన్నాయుడువలస, పెదంకలాం సుమిత్రాపురం నిడగల్లు తదితర గ్రామాల్లో 5 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు చేపట్టారు. ఈ ఏడాది చెరకు ప్లాంటేషన్ సాగువిస్తీర్ణం పెరగడం వల్ల, మొక్కలు నాలుగైదు రేకులతో ఉన్నందున ఎరువు అవసరం ఉందని రైతులు అంటున్నారు. మండలంలో పండించిన చెరకు సంకిలి ఈఐడీ ప్యారీస్ కర్మాగారానికి తరలిస్తున్నారు. చెరకు ప్లాంటేషన్ సాగుతున్న కారణంగా ఎరువుఅవసరం ఉందని చెరకు మొక్కలకు వేయాల్సిన ఎరువులను ఆర్బీకేల ద్వారా సరఫరాకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఎరువుల లభ్యత విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా చెరకు సాగు విస్తీర్ణం పెరిగిందని అందుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రైతుల డిమాండ్ మేరకు పంటలకు అవసరమైన ఎరువులు పీఏసీఎస్‌ల ద్వారా విక్రయిస్తామన్నారు.

సంబరాల్లో కూటమి



ఎస్.కోటలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న తెలుగుదేశం శ్రేణులు

- ఎస్.కోటలో విజయం సాధించిన కోళ్ల లలిత కుమారి
- 38,790 పైగా ఆధిక్యం
- మొరాయించిన ఏడు ఈవీఎంలు
- వీవీ ప్యాట్‌లలోని స్లిప్‌లు లెక్కింపు

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల సమరంలో శృంగవరపుకోటను ముచ్చటగా మూడవసారి కోళ్ల లలితకుమారి దక్కించుకుంది. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయనగరంలోని లెండి ఇంజినీరింగ్ కళా శాలలో మంగళవారం జరిగింది. ఈలెక్కింపు ప్రక్రియలో తొలిరౌండ్ నుంచి 20వ రౌండ్ వరకూ ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి లలితకుమారి ఖచ్చితమైన ఆధిక్యం ప్రదర్శించారు. కౌంటింగ్ ప్రక్రియలో తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. అనంతరం ఈవీఎంల లెక్కింపు ఆరంభం అయ్యింది. 20 రౌండ్లలో తెలుగుదేశం అభ్యర్థి లలితకుమారి 1,06,766 ఓట్లు సాధించగా, వైఎస్సార్సీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు 69,728 ఓట్లు సాధించారు. 20 రౌండ్లలో లలితకుమారి 37,038 మెజార్టీ సాధించగా, ఏడు వీవీప్యాట్ల లెక్కింపులో 687ఓట్లు, పోస్టల్ బ్యాలట్లలో 1,759 ఓట్లు సాధించి మొత్తంగా 39,484 ఆధిక్యం మూటకట్టుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని ఏడు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ముందుగా ఇబ్బందులు లేని ఈవీఎంలను తెరిచి లెక్కింపు ప్రక్రియ పూర్తి చేశారు. తర్వాత మొరాయించిన ఏడు ఈవీఎంల స్థానంలో వీవీప్యాట్‌లను తెరిచి బ్యాలెట్ స్లిప్పలను లెక్కించి ఫలితాన్ని ప్రకటించారు. ఫలితాల అనంతరం ఆర్ఓ మురళీకృష్ణ లలితకుమారికి ఎన్నికల ధృవపత్రాన్ని అందజేశారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ఎమ్మెల్యేగా ఎన్డీఏ కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి విజయం సాధించడంతో ఎస్.కోట, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి మండల కేంద్రాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి, కేకులు కట్ చేసి పంచి పెట్టుకుని, డ్యాన్స్‌లు వేసి, ఈల లు వేస్తూ, కేరింతలు కొట్టారు.

గజపతినగరం విజేత కొండపల్లి

దత్తిరాజేరు: సార్వత్రిక ఎన్నికల్లో గజపతినగరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ 23,388 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. విజయనగరంలోని లెండి కళాశాలలో మంగళవారం కౌంటింగ్ జరిగింది. 18 రౌండ్లలో కొండపల్లి శ్రీనివాస్ 91,987 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య 68,599 ఓట్లు సాధించా రు. కొండపల్లి శ్రీనివాస్ గెలుపొందడంతో నియోజకవర్గంలో టీడీపీ,జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

చీపురుపల్లిలో కూటమి అభ్యర్థి కళా గెలుపు

చీపురుపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి నుంచి టీడీపీ అభ్యర్థి కిమిడి కళావెంకటరావు గెలుపొందారు. 20 రౌండ్లలో జరిగిన లెక్కింపులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణపై 11,639 మెజార్టీ సాధించారు. 18 రౌండ్లలో కళావెంకటరావుకు 87,083 ఓట్లు, బొత్స సత్యనారాయణకు 75,444 ఓట్లు వచ్చాయి.

రాజాం, బొబ్బిలి ఎమ్మెల్యేలుగా కోండ్రు, బేబీ నాయన ఎన్నిక



కోండ్రు మురళీమోహన్



బేబీ నాయన

రాజాం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన కోండ్రు మురళీమోహన్ ఎన్నిక కాగా, బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన బేబీ నాయన(ఆర్.వి.ఎస్.కె.రంగారావు) ఎంపికయ్యారు. విజయనగరం లెండి కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. రాజాం నియోజకవర్గంలో మొత్తం 2,27,503 మంది ఓటర్లు ఉండగా, 1,76,494 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు 94,385 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కి 73,663 ఓట్లు లభించాయి. ఈ నేపథ్యంలో కోండ్రు మురళీమోహన్ తన ప్రత్యర్థి తలే రాజేష్‌పై 20,722 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తొలిరౌండ్ నుంచే కోండ్రుకు ఆధిక్యం కనిపించింది. ఇదే నియోజకవర్గం నుంచి కోండ్రు రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఈ మేరకు ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో నోటాకి 2,536 ఓట్లు పోలయ్యాయి.

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. బొబ్బిలి శాసనసభ స్థానం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచిన బేబీ నాయన(ఆర్.వి.ఎస్.కె.రంగారావు) ప్రత్యర్థి అయిన శంబంగి వెంకట చినఅప్పలనాయుడుపై 43,845 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ మేరకు ఆయనకు ఎన్నికల అధికారులు ధ్రువపత్రం అందజేశారు. మొత్తం పోలైన ఓట్లు 2,31,232, బేబీ నాయనకు వచ్చినవి 99,792 ఓట్లు కాగా, శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకి 58,418 ఓట్లు వచ్చాయి.

నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం:

పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురానికి నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు సోమవారం నుంచి ప్రారంభమైంది. ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు పార్వతీపురం నుంచి బయలుదేరే బస్సు రాత్రి 9.45 గంటలకు గుమ్మలక్ష్మీపురం చేరుకుంటుంది. ఆ రాత్రి ఆ బస్సు అక్కడే ఉండి మరుసటిరోజు ఉదయం 5.20 గంటలకు పార్వతీపురం బయలుదేరివెళ్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు ప్రజలను కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం సిటీ:

మండలంలోని పెనుబాక గ్రామ ముద్దాడ చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో కె.సాయిరాం మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్టర్లు చూసి, పనిలోకి వచ్చిన వారికే మస్టర్లు వేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వ్యక్తికి పనులు కల్పించాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల బారినపడకుండా జాగ్రత్త వహించాలని, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్సా కిట్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో హరనాథ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వస్తుందన్నారు. మామిడి తోటల్లో ఫారంపాండ్స్ ఏర్పాటుకు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనుల సమయంలో వర్షం వస్తే వెంటనే ఇంటికి వెళ్లిపోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ మీసాల రామినాయుడు, టీఏ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

రేగిడి: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రానికి మంగళవారం విచ్చేసిన ఆయన.. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఎవరు గెలిచినా ఒకేలా స్పందించే తీరును కనబరచాలన్నారు. అనవసరంగా గొడవలు పడవద్దని, ఒకరినొకరు దూషించుకోవద్దని తెలిపారు. సోదరభావంతో మెలగాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఇ.శ్రీనివాస్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్ బోర్డు ఆడుతున్న విద్యార్థులు

రామభద్రపురం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని లైబ్రేరియన్ సత్యవాణి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయానికి మంగళవారం విచ్చేసిన విద్యార్థులకు తెలుగు, గణితం, విజ్ఞానశాస్త్రం అంశాలతో పాటు చిత్రలేఖనం, వక్తృత్వం, క్రాఫ్ట్ వర్క్, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం, క్యారమ్ బోర్డు ఆట వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలను వ్యక్తిత్వ వికాసం వైపు మళ్లించడం , పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చాలన్న సదుద్దేశ్యంతోనే ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల పహారా



పెదమేరంగి కూడలిలో పోలీస్ బందోబస్తు

జియ్యమ్మవలస: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని గుమ్మలక్ష్మీపురం సీఐ సత్యనారాయణ సూచించారు. పెదమేరంగి కూడలిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా చేపట్టారు. ఎవరు గెలిచినా ఒకేలా స్పందించే తీరును కనబరచాలని, ఏ ఒక్కరూ ఒకరికొకరు దుర్భాషలాడడం గానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవడం గానీ చేయవద్దన్నారు. ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు ముగ్గురు ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రఘురామరాజు మంగళవారం వెల్లడించారు. ఎంపికైనా వారిలో బి.సృజన, బి.సాలోమి, పి.సాయి ఉన్నారు. సృజన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఉత్కంఠకు తెర

- ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు
- విజయనగరం ఎమ్మెల్యేగా అధితి గజపతిరాజు గెలుపు
- సంబరాల్లో టీడీపీ శ్రేణులు



ఎ.అదితిగజపతిరాజు



అశోక్ బంగ్లాలో టీడీపీ నాయకుల సంబరాలు

విజయనగరం/ విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయనగరం నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. కౌంటింగ్‌కు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను సిబ్బంది లెక్కించారు. అనంతరం నియోజకవర్గం పరిధిలోని 260 పోలింగ్ స్టేషన్‌లో జరిగిన ఓట్ల పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించారు. దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాల్గవ విడతలో గత నెల 13న పోలింగ్ ప్రక్రియ నిర్వహించిన విషయం విదితమే. మొత్తం 19 రౌండ్‌లలో జరిగిన లెక్కింపు ప్రక్రియలో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిపై ప్రతిపక్ష టీడీపీకి చెందిన పూసపాటి అదితిగజపతిరాజు 57,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు అన్ని రౌండ్‌లలో టీడీపీ అభ్యర్థి ఆధిక్యత కనబరిచారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అదితి గజపతిరాజు 2019లో జరిగిన ఎన్నికల్లో కోలగట్ల వీరభద్రస్వామిపై ఓటమిని చవిచూసిన విషయం విదితమే.

భద్రత పటిష్టం:

విజయనగరం జేఎన్‌టీయూజీవీలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జరిగిన ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగించడంలో జిల్లా యంత్రాంగం సఫలీకృతమైంది. ఓట్ల లెక్కింపు జేఎన్‌టీయూ ప్రాంగణానికి ప్రధాన రహదారి నుంచి సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లెక్కింపు ప్రక్రియ పూర్యయ్యేంత వరకు వాహనాలను వేరే మార్గాల గుండా మళ్లించారు. అంతేకాకుండా లెక్కింపు కేంద్రంలోకి అధికారికంగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన గుర్తింపు పాసులు కలిగిఉన్న వారినే అనుమతించారు. అలాగే పోలింగ్ ఏజెంట్లకు సంబంధించి సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

సంబరాలు చేసుకున్న టీడీపీ నేతలు:

2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పూసపాటి అదితిగజపతిరాజు విజయం సాధించటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక అశోక్ బంగ్లాలో జరిగిన వేడుకల్లో నియోజకవర్గ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అదితి గజపతిరాజు, ఆమె తల్లిదండ్రులు పి.అశోక్‌గజపతిరాజు, సునీలా గజపతిరాజులను ఆపార్టీ నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు.

రౌండు	వైఎస్సార్‌సీపీ	కూటమి
1	5400	6299
2	3338	8176
3	3104	5868
4	4365	5004
5	4030	6624
6	3816	6290
7	3782	6671
8	3675	5824
9	3953	4793
10	3514	5946
11	4020	6826
12	4566	6128
13	3383	4758
14	3742	6239
15	4300	6062
16	4672	4994
17	3856	6444
18	1706	5077
19	187	296

నెల్లిమర్లలో ఓటింగ్ సరళి

పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి గెలుపొందారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం 248 బూత్‌లకు సంబంధించి 19 రౌండ్లలో జరిగిన కౌంటింగ్ ప్రక్రియలో తొలి రౌండ్ ఓట్ల కౌంటింగ్ నుంచి కూటమి అభ్యర్థి ఆధిక్యత కొనసాగింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడుకు 69,409 ఓట్లు రాగా, కూటమి అభ్యర్థి లోకం నాగమాధవికి 1,08,316 ఓట్లు వచ్చాయి.

విత్తనాల కోసం ఆందోళన వద్దు



రేగిడిలో విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఏవో జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస, ఉంగరాడ, ఆముదాలవలస, రేగిడి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం చేపట్టిన విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎంటీయూ-1121 రకం 3,600 బస్తాలు, స్వర్ణ రకం 770 బస్తాలు వచ్చాయన్నారు. ఆర్బీకేల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, స్వర్ణ, సంపత్ రకాల విత్తనాలు త్వరలో వస్తాయన్నారు.

రేగిడి: అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో విత్తనాల కోసం రైతులు మండల కేంద్రాలకు వెళ్లేవారని, ఇప్పుడు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు లభిస్తుండడంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.